
# పాపం బ్రహ్మానందం!

'శ్రీతాసత్య'



ఒకసారి రెండు చేతులతోనూ తలమీది వెంట్రుకల్ని తడుముకుని, ఎదురుగా కూర్చున్న వ్యక్తి వైపు చూసి, "ఊఁ" అని తల వంచాడు బ్రహ్మానందం ఏడుపు మొహంతో.

ఇరవైనాలుగేళ్ల వయసొచ్చినా తన వ్యక్తిగత అభిప్రాయాలకు విలువివ్వని తండ్రి గుర్తొచ్చి పళ్లు పటపట లాడించాడు - ఎన్నో ఏళ్లుగా తన నిస్సహాయతను ఆ విధంగానే వ్యక్తం చేయడం అలవాటైన బ్రహ్మానందం.

అతడికి ఊహ వచ్చినప్పటి నుంచి, అతడి నెత్తి మీద ఎన్ని వుంజీల వెంట్రుకలు ఎంత మందాన ఉండాలో నిర్ణయించే అధికారాన్నతడి . తండ్రి హస్తగతం చేసుకున్నాడు. తన క్లాసే చదువుతున్న కుర్రాళ్లలా హిప్పీ జుట్టు పెంచుదా మనుకుని సంబరపడి ఓసారి తండ్రి నడిగితే అంతెత్తు లేచా డాయన.

"ఈ హిప్పీ కటింగ్‌లూ, జిప్పీ కటింగ్‌లూ మన దగ్గర పనిచేయవ్! నోర్మూసుకుని పడుండు!" అని కసిరి, క్షురకుడితో చర్చలకు దిగి, అతడి అమూల్యమైన సలహాలను కూడా పరిగణనలోకి తీసుకుని అతడి కో పురికొస ముక్క ఇచ్చాడు బ్రహ్మానందం తండ్రి.

ఆయన ఇచ్చిన పురికొసను భక్తిగా అందుకుని, బ్రహ్మానందం నుదుటి పై నుంచి చెవుల మీదుగా వెనక్కి తిప్పి కట్టి, పురికొస కింది భాగ మంతా వంపర పనస తొవ్వలా చెక్కిపారేశాడు ఆస్థాన క్షురకుడు. అతడి పనితనానికి పూర్తి సంతృప్తి చెందిన బ్రహ్మానందం తండ్రి గిరజాలవెంకటస్వామిఅప్పటినుంచి నెలనెలా దగ్గరుండి ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయించేవాడు.

బ్రహ్మానందం ఇంకొంచెం పెద్దవా డయ్యాక స్టెప్ కటింగ్ లొచ్చాయి. తన కోరిక తండ్రి ఎలాగూ తీర్చడని, తండ్రి ఊళ్లో లేని రోజున క్షురకుడినే బతిమాలుకున్నాడు - "బాబ్బాబు! నీకు పుణ్య ముంటుంది. నువ్వు నాకు మోడ్రన్ కటింగ్ లేమీ చేయనక్కరలేదు. కనీసం చెవులకు తగిలేలాగైనా జుట్టు ఉంచు" అని.

దాని కతడు వేదాంతిలా నవ్వి "మీ తల మీద ఎక్కువ జుట్టు ఉంచితే నాకు బరువేంటి అబ్బాయిగారూ? మీ జుట్టు మీరే మోసుకుంటారు గానీ నా కేం బాధ? మీరు చెప్పినట్లే చేస్తాన్లెండి!" అని, జాలిపడి యథాశక్తి తన పని కానిచ్చాడు.

బ్రహ్మానందం 'చాలు చాల'ని మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా పొడుగు దువ్వెనతో జుట్టును అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు దువ్వి కత్తిరించి, తనకు తృప్తి కలిగిన తర్వాతే బ్రహ్మానందాన్ని వదిలి, అన్నాడు - "చూసుకోం డబ్బాయిగారూ! నే నేదో ఎక్కువ జుట్టు కత్తిరించేస్తున్నా నని నెలనెలా బాధపడిపోయేవారు! ఇప్పుడు చూసుకోండి, ఎలా ఉందో!"

అతడి మాటల మీద నమ్మకం లేకపోయినా, పంటి మీది జుట్టును దులుపుకుని, అద్దంలో మొహం చూసుకుని, "కెవ్వు" మని అరిచాడు బ్రహ్మానందం.

ముళ్లపంది వెంట్రుకల్లా తల మీది వెంట్రుక లన్నీ నిక్కబొడుచుకుని ఉన్నాయి. అతణ్ణి మరో మాటంటే 'సరి చేస్తా' నని చెప్పి అవి కూడా కత్తిరించేస్తా డేమో నని భయపడి ఏం మాట్లాడలేదు బ్రహ్మానందం.

స్నానం చేశాక తలకు కొబ్బరి నూనె రాశాడు.

నీళ్లు రాశాడు.

ఊహుఁ!

జిగురులాంటి చిక్కటి ఆముదాన్ని ఓ వైపు వాసన వేస్తున్నా ముక్కు మూసుకుని రాసుకున్నాడు.

ఊహుఁ!

అయినా అతడి తల మీద ఉన్న కొన్ని లక్షల వెంట్రుకల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా వంగిన పాపాన పోలేదు.

ఇటువంటి అనుభవాలు చాలా అయ్యా యతడి జీవితంలో. తోటి విద్యార్థుల వెటకారాలు, విద్యార్థినుల అవహేళన - ఇవన్నీ సహించి, ఓపికతో భరించి డిగ్రీ పూర్తి చేసి, ఒకానొక సంస్థలో ఓ మహానుభావుడి సిఫార్సుతో ఉద్యోగం సంపాదించుకున్నాడు.

ఆ రోజు పోస్టులో వచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూపించి అన్నాడు తండ్రితో - "నాకు ఉద్యోగం వచ్చింది. రేపే వెళ్లి చేరుతాను."

ఆయ నేమీ మాట్లాడకుండా తీవ్రంగా ఆలోచించాడు. ఆయన మొహం చూస్తే ఏదో ప్రమాదం తలపెట్ట బోతున్నట్టే అనిపించి బ్రహ్మానందం అక్కడ్నుంచి జారుకోబోయాడు.

అంతవరకు మౌనిలా నిల్చున్న గిరజాల వెంకటస్వామి - "ఆగు!" అని హుంకరించాడు. తండ్రి కూర్చోమంటే కూర్చోవడం, నిల్చోమంటే నిల్చోవడం తప్ప తెలియని బ్రహ్మానందం అక్కడే ఆగిపోయాడు - 'ఇవ్వాళ నా కేదో మూడింది' అనుకుంటూ.

"ఒరేయ్, బెమ్మిగా! బెమ్మిగా! రేపే బయలుదేరి తిరుపతి వెళ్లు. నువ్వు పుట్టినప్పుడే మొక్కుకున్నాను - నీ కుద్యోగం వచ్చాక నీ తలనీలాలు స్వామి వారికి సమర్పిస్తానని!" అన్నా డాయన. భక్తి పారవశ్యం మాటల్లో ఉట్టిపడుతోంది.

పక్కలో బాంబు పడ్డట్టనిపించి, ఉన్న చోట నుంచి ఎగిరి కాస్త పక్కకు దూకాడు బ్రహ్మానందం.

బ్రహ్మానందం తండ్రికి చిర్రెత్తు కొచ్చింది. "ఏవిఁట్రా వెధవా! కుప్పి గంతులూ, నువ్వూనూ, చిన్నపిల్లాడిలా?" అని కసిరాడు.

బ్రహ్మానందానికి ఏడు పొచ్చింది. 'నేను పుట్టినప్పు డీయన మొక్కుకోవడ మేమిటీ?' అనుకుని జుట్టు పీక్కోబోయాడు.

తండ్రి గట్టిగా అరిచాడు - "వెధవా! దేవుడి జుట్టును అలా పీకుతావా? ఒక్క వెంట్రుక పొరపాటున రాలిపోయినా నా మొక్కు చెల్లనట్టే! అసలే పడ్డీ కాసులవా డాయన. రాలిపోయిన ప్రతి వెంట్రుక్కీ మరో వెంట్రుక ముక్కు పిండి మరీ వసూలు చేయగలడు - ఏ మనుకుంటున్నావో?"

తండ్రి హెచ్చరిక విన్న బ్రహ్మానందానికి తన అసహాయతకు తన మీదే జాలి కలిగింది. తన తల మీది జుట్టు తనది కాదా? ఇది దేవుడిదా? 'హ్హ హ్హ హ్హ!' అని నవ్వబోయి, తండ్రి తనను మళ్లీ మళ్లీ నవ్వకుండా నోరు కుట్టించేస్తా డేమో నని భయపడి, "అలాగే!" అన్నాడు కన్నీళ్లు బొటబొటా కారుస్తూ.

నా ల్రోజుల తర్వాత మొక్కు చెల్లించి ఇంటి కొచ్చిన కొడుకును గుమ్మంలోనే ఎదురై గిరజాల వెంకటస్వామి చూసి అగ్గిరాము డైపోయాడు.

అప్పటికే తల నీలాలు పోయిన దిగులుతో వెలుగుండగానే బస్సు దిగినా, బస్స్టాండ్‌లోనే నెత్తి మీద గుడ్డ వేసుకుని కాలక్షేపం చేసి, చీకటి పడ్డాక ఇంటి కొచ్చిన బ్రహ్మానందం - తన మీద ఎగిరిపడిన తండ్రిని చూసి మొదటిసారిగా కోపం తెచ్చుకున్నాడు.

బ్రహ్మానందా న్నేమీ మాట్లాడ నివ్వకుండా అన్నా డాయన - "వెధవా! ఏమిట్రా మూతి మీద ఆ మీసం ఏమిటి? నీ కేం చెప్పాను? ను వ్వేం చేసుకొచ్చావ్?"

'మగవాడు మూతి మీద మీసం ఉంచుకోవడం కూడా తప్పా? తలనీలా లంటే మీసం కూడా అందులోకే వస్తుందా" - అదే మాట అడిగాడు తండ్రిని.

అయన చిందులు తొక్కాడు. మర్నాడు క్షురకుణ్ణి పిలిపించి, దగ్గరుండి మీసాలు తీయించి, భద్రంగా పొట్లం కట్టి, ఆ పొట్లం ఇంట్లోని వేంకటేశ్వరస్వామి పటం ముందు పెట్టి, చెంపలు వేసుకోమన్నాడు కొడుకుని.

మారు మాట్లాడకుండా రెండు చేతులూ చెంపల మీద ఆనించుకుని నిలబడ్డ బ్రహ్మానందాన్ని తిట్టి, తన చెంపలు 'ఛెళ్' మనిపించుకుని, "ఇలా వేసుకోరా, వెధవా!" అని బ్రహ్మానందం చేత్తో అతడి చెంపలు దవ్వుల్లా మోగేలా చేసి, ఆ పొట్లాన్ని మర్నాడే పోస్టులో శ్రీవారికి కానుకగా పంపించి తరువాత బ్రహ్మానందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు - ఉద్యోగంలో చేరమని.

ఏదో ఒక కారణం చెప్పి బ్రహ్మానందం తల మీది జుట్టు కనీసం ఆర్నెల్ల కోసారి పూర్తిగా తీయించనిదే ప్రశాంతంగా ఉండేవాడు కా దతడి తండ్రి. దరిమిలా అతణ్ణి మిత్రులు - 'బోడి గుండు బెమ్మిగాడ'నీ, పరిచయస్థులు 'బోడిగుండు బ్రహ్మానందంగార'నీ పిలవడం సర్వసాధారణమైపోయింది.

అతడికి ఉక్రోషం వచ్చేది. తను మాత్రం మహారాజులా ఠీవిగా గిరజాలు పెంచుకుని, తన తల మాత్రం ఎప్పుడూ నున్నగా ఉంచడానికి అహర్నిశలూ పథకాలు వేసే తండ్రి మీద.

కొంతకాలం తర్వాత తనకు పెళ్లి నిశ్చయమైందని తెలుసుకుని, తండ్రి దగ్గరకు వెళ్లి అన్నాడు భయపడుతూనే - "నాన్నా! ఈ పెళ్లి సంబంధం కుదిరితే నా తలనీలాలు సమర్పిస్తా నని మళ్లీ ఏ దేవుడికో మొక్కుకోలేదు కదా!"

గిరజాల వెంకటస్వామి ఫెళ్లున దగ్గి, ఘొల్లున నవ్వి అన్నాడు - "నన్ను మరీ అంత బుర్ర లేనోడిగా జమకట్టకు రోరే! లాభం లేకుండా ఏ పనీ ఉత్తినే చేయ డీ గిరజాల వెంకటస్వామి."

ఆ మాత్రానికే సంబరపడిపోయాడు బ్రహ్మానందం. కానీ అతడి సంబరం ఎంతో కాలం నిల్వబడలేదు.

పెళ్లయిన అతడి భార్య బాలసరస్వతి భర్త తలలో వేళ్లు జొనిపి, అతడి కళ్లలోకి మురిపెంగా చూస్తూ, "నా కోరిక తప్పకుండా తీరుస్తారు కదూ!" అంది.

మైకంలో ఉన్నాడేమో తలూపాడు బ్రహ్మానందం. తీరా భార్య కోరిక విన్నాక, జుట్టు పీక్కుంటూ ఎదురుగా ఉన్న నిలువు టద్దంలోకి చూస్తూండిపోయాడు.

బాలసరస్వతి బామ్మగారు మొక్కుకుందట - 'మనవరాలికి పెళ్లయ్యాక, ఆవిడ గారి మొగుడి జుట్టు సింహా ద్రప్పన్నకు సమర్పించుకుంటా' నని.

బాల సరస్వతి ఎంతో బాధపడుతూ - "నాకు మాత్రం ఇష్ట మనుకుంటున్నారా తల మీద జుట్టు లేకుండా చూడటం? అయినా ఎంత? మూణ్ణెల్లలో మళ్లీ వచ్చేస్తుంది కదా!" అంది తిరిగి భర్త జుట్టు నిమురుతూ.

ఆ బామ్మగార్ని ఉండలా చుట్టి సప్త సముద్రా లవతలికి విసిరేయా లన్నంత కోపం వచ్చింది బ్రహ్మానందానికి. ఇ దేం మొక్కు? పరాయివాడి జు ట్టిప్పిస్తా నని ఆవిడ మొక్కుకోవడం వేవిటి?

పళ్లు పటపట లాడించిన భర్తతో అంది బాల సరస్వతి - "మీకు తెలియదేమో - మా అమ్మా నాన్నా చిన్నప్పుడే పోతే నన్ను పెంచింది బామ్మ. ఈ డొచ్చినప్పటి నుంచి నాకు సంబంధాలు చూస్తున్నా నా పెళ్లి ఇంతాలస్యం కావడానికి కారణం - మా బామ్మ మొక్కు తీర్చే వ్యక్తి దొరక్కపోవడమే!"

బ్రహ్మానందం ఆవేశం పట్టలేకపోయాడు. "ఏం, నా మొహం చూడగానే ఏబ్రాసి వాడిలా కనిపించానా మీ బామ్మకి? అయినా నే నొప్పుకుంటాన నెలా అనుకుంది మీ బామ్మ?"

బాల సరస్వతి జాలిగా చూసి, అంది భర్తతో - "మన పెళ్లికి ముందే మీ నాన్నగారితో ఒక ఒప్పందానికి వచ్చింది మా బామ్మ. దాని ప్రకారం పెళ్లయిన తర్వాత మీ రావిడ మొక్కు తీర్చేటట్టయితే మరో పదివేలు ఎక్కువ ముట్టచెపుతా నం దావిడ కట్నం రూపేణా. మీ నాన్న గా రందు కొప్పుకోవడం వల్లనే మన పెళ్లి జరిగింది."

'నేను లాభం లేకుండా ఏ పనీ ఉత్తినే చేయనురోయ్!' అని తన తండ్రి అన్న మాటలు గుర్తొచ్చి, 'రేయ్! గిరజా లెంకటసామీ! నువ్వు నా బాబువి కాదు, నా పాలిట శనిగాడివి!' అనుకుంటూ పళ్లు నూరాడు బ్రహ్మానందం.

కాస్సేపటికి తేరుకుని, "సరే! ఈ ఒక్కసారికీ ఒప్పుకుంటున్నాను. మీ బామ్మ రాక్షసి కోసం కాదు, నీ కోసం. కేవలం నీ కోసం! గుర్తుంచుకో!" అన్నాడు బ్రహ్మానందం.

"ఎంత మంచివారండీ!" అంటూ భర్తను మెచ్చుకుంది బాల సరస్వతి.

## 2

బ్రహ్మానందం తండ్రి గిరజాల వెంకటస్వామీ, ఆస్థాన క్షురకుడూ కాలగర్భంలో పడి కొట్టుకుపోయిన తరువాత బ్రహ్మానందం జుట్టు కత్తిరించే మొనగా డెవడూ లేకపోయాడు.

అతడి తండ్రి పరమపదించిన కొన్నాళ్లకు బ్రహ్మానందం పెద్ద కొడుకు 'గిరజాల వెంకటస్వామి' తండ్రి దగ్గరకు వచ్చి అన్నాడు - "నాన్నా! రేపే మా రిజల్ట్స్ వస్తున్నాయి. నేను ఖచ్చితంగా పాస్ అవుతాను. నువ్వు సిద్ధంగా ఉండు!"

బ్రహ్మానందం కొడుకు వైపు తేరిపార చూశాడు. వాడి దంతా తన తండ్రి పోలికే! ఎప్పుడైనా కోపం వచ్చి వాణ్ణి కొట్టబోతే, తన తల్లి అడ్డుపడి - "ఒరే బెమ్మీ! మీ నాన్నగారు పోయాక, ఆయన్ని వీడిలో చూసుకుంటున్నానురా! వీణ్ణి కొడితే నా మీద ఒట్టే!" అనేది.

తండ్రి బ్రతికుండగా అతణ్నెలాగూ ఎదిరించలేకపోయాడు. కనీసం తండ్రి పోలికలు పుణికిపుచ్చుకున్న వీణ్ణయినా వీలైనప్పుడల్లా ఓ దెబ్బ వేసి, కసి తీర్చుకుందా మనుకున్న బ్రహ్మానందం ఆ పని చేయలేకపోయేవాడు - తన తల్లి అడ్డొస్తూండటంతో.

అందువల్లే వాడు మరీ పెంకిగా తయారయ్యాడు. తండ్రంటే లక్ష్యం లేదు వాడికి. అందుకే ధైర్యంగా తండ్రి నా మాట అడగ్గలిగాడు.

కొడుకు మాట లర్థం గాక - "ఏమిట్రా, నువ్వు మాట్లాడేదీ?" అన్నాడు బ్రహ్మానందం.

వాడు క ళ్లెగరేసి అన్నాడు - "నేను పరీక్ష పాస్ అయితే నీకు గుండు చేయిస్తా నని అన్నవరం సత్యనారాయణ స్వామికి మొక్కుకున్నాను. నేను పాస్ కావడం ఖాయం కనుక నువ్వు బయలుదేరే ఏర్పాట్లు చేసుకుంటే మంచిది."

బ్రహ్మానందం అదిరిపడ్డాడు.

అత డేదో అనేలోగా అతడి కొడుకు గిరజాల చినవెంకటస్వామి అన్నాడు - "నీకు దమ్ము ల్లేవు కనుక అప్పట్లో మీ నాన్న నెదిరించలేక గుండు గీయించుకునేవాడివి. అప్పటి ధర్మం ప్రకారం కొడుకులు తండ్రుల మాటలు వినాలి. ఇప్పుడు తండ్రులే కొడుకుల మాటలు వినాల్సిన కాలం ఇది. కనుక నువ్వు నా మొక్కు తీర్చి, 'బోడి గుండు బ్రహ్మానందం' అనే పేరును సార్థకపరచుకో!"

బ్రహ్మానందానికి నోట మాట రాలేదు.

అతడికి విపరీతమైన కోపం వచ్చింది, కొడుకు మీద కాదు - తన జుట్టు మీద.

తన నెత్తిమీద జుట్టు ఉండటం వలనే కదా ఇంతమంది ఇన్ని రకాలుగా మొక్కుకుంటున్నారు!

వాళ్ల కా అవకాశం లేకుండా చేస్తే?

.... ...

ఆ ఆలోచన వచ్చిన తక్షణమే అమలు జరిపాడు.

ఇప్పుడు బ్రహ్మానందానికి నెత్తి మీద ఏ సమయంలో చూసినా జుట్టు కనబడదు.

వారాని కో సారి అతడే సెలూన్‌కు వెళ్లి నున్నగా గుండు గీయించుకోవడం అలవాటు చేసుకుని, తన కుటుంబ సభ్యుల మీది కసిని ఆ విధంగా తీర్చుకుంటున్నాడు పాపం, బ్రహ్మానందం!

★